# జీవితం-చదువు

## రావు

కాగితంమీద కలం పెట్టబోతుంటే "ఏమండీ!" అంటూ శ్రీమతి గదిలోకి వచ్చింది.

నేను అనుకుంటూనే ఉన్నాను-ఈరోజయినా ఈ కథసాగేమాట ఎంతవరకు నిజమని. వ్రాద్దామనుకున్న కథ అయిదు నెలలనుంచీ వాయిదాపడుతున్నది. ఆదివారం కోసం వారంరోజులపాటు ఎదురుచూస్తాను. తీరా ఆరోజు 'ఇదిగో వచ్చాను' అని చెప్పకునే శుభవేళకు ఏదోఒక కొత్తపని పలకరించి చేయిపట్టుకొని ఈడ్చుకుపోతుంది—ఇంటికివచ్చినఆదివారాన్ని పరామర్శించే వ్యవధయినా ఉండదు. ఇలా ఇరవై ఆదివారాలు వచ్చినయ్, పోయినయ్. ఈ ఆదివారమయినా ముడిపడుతుందేమో ననుకుంటుంటే ఎన్నడూలేని ఆప్యాయతతో పలకబోతూ శ్రీమతి వేంచేసింది.

చదువుకునే రోజుల్లోనే నయం—వారానికో కథ వ్రాసేవాడిని. సంసారపు జంఝాటంలోపడి నాకు క్షణంతీరిక ఉండటం లేదు; జీవితయాత్రలో నిమిషంపాటు విశ్రాంతి లభించటంలేదు. పగలల్లా పనిచేసి తెచ్చుకునే జీతపురాళ్ళు రాత్రింబవళ్ళ ఖర్చుకు చాలని కారణాన రాత్రిళ్ళూ కష్టపడాల్సి వస్తున్నది.

"ఏమండీ!"

ఇక సమాధానమీయకపోతే గరిస్తున్న మేఘం వర్షిస్తుందేమోనని భయపడి 'ఏమిటి?' అన్నట్లు తలెత్తి చూశాను.

"సినిమా మాట ఏం చేశారు?" గోముగా ప్రశ్నించింది.

సినిమాకు తీసికెళ్తానని మాట యిచ్చినట్లుగా నాకు జ్ఞాపకం లేదు. శ్రీమతి వేసే ఎత్తులలో ఇది ఒకటి. ఇచ్చినమాట తప్పటం నా జీవితంలో లేదు. ఆ బలహీనతను కనిపెట్టి ఉపయోగించుకో చూస్తున్నది.

"తీసికెళ్తానని అన్నానా?"

ఇలాంటి ఎదురుప్రశ్న వస్తుందని ఆశించి ఉండలేదో ఏమో పాపం తడబడింది శ్రీమతి.

"అహ...అనలేదనుకోండి...ఆదివారం కదా...సినిమాచూసి వారంరోజులయింది."

"నువ్వు సినిమా చూసి వారం రోజులైతే నేను కథ వ్రాసుకుని అయిదు నెలలయింది. దానికేమంటావ్?"

"కథదేముంది. రాత్రికి రాసుకోవచ్చును లెద్దురూ?"

ఇలా కాకుండా నా పరిస్థితి వర్ణంచేసుకుని 'మీరు వ్రాసుకోవాల్సిన పనుంటే వచ్చేవారంపోదాం లెద్దురూ' అని ఉంటే నేను కరిగిపోయేవాణ్నేమో! కాని పోవాల్సిందేనని మంకుపట్టుపట్టటం నాకేమాత్రం సమంజసంగా కన్పించలేదు.

"రాధనో, అమ్మనో తోడుతీసికెళ్ళు. అసలేం సినిమాకు పోదామనుకుంటున్నావ్?"

"హంతకుడు - అని మంచి డిటెక్టివ్ పిక్చర్...చాలా బావుంటుందని పత్రికలో వ్రాశారు..."

"అదయితే ఈ పూటే ఆఖరి ఆట...ఎవరయినా వసేపో. ఒంటరిగా పోయినా నాకేమభ్యంతరం లేదు"

### కొండముది హనుమంతరావు

ఏమనుకుందో ఏమో శ్రీమతి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

టేబుల్ మీద ఉన్న అలారం గడియారం కాలచక్రాన్ని ముందుకు తోసుకుపోతున్నది. ఎనిమిదిగంటలయింది టైము. కిటికీలోంచి పడుతున్న మాఘమాస ప్రభాత సూర్యకాంతిని ఏడు రంగులుగా పొదుగుతున్న టేబుల్ వెయిట్‌ను చూస్తూ—కథ ఎలా మొదలుపెడితే అందంగా, ఆకర్షణీయంగా ఉంటుందా — అని ఆలోచిస్తున్నాను. ఎంతకీ తేలటంలేదు సమస్య. ఏదో ఒక విధంగా వ్రాసేద్దామంటే కొద్దో, గొప్పో పేరున్న రచయితను — అందులోనూ చాలాకాలానికి కన్పించబోయే కథ—కాబట్టి బాగా ఆలోచించి, ఒళ్ళు దగ్గఱపెట్టుకు వ్రాయాలి. అలాకాక ఆషామాషీగా వ్రాశానా—సంపాదకులు ప్రచురించినా, ప్రచురించిన మరుసటి రోజునుంచి పఠితలు మొహాన దుమ్మెత్తిపోస్తారు; నిర్మొహమాటంగా ఉత్తరాలద్వారా దుయ్యబట్టారు.

పక్కింటివారి అమ్మాయి పార్వతి కర్రకోసం వెదుకుతున్న విషయం గ్రహించని కుక్క దాలిగుంటలో నిశ్చింతగా నిద్రిస్తున్నది.

వెనుకనుంచి ఎవరో తటుముతూన్నట్లుగా కిటికీలోంచి రివ్వున వచ్చినగాలి టేబుల్ మీది కాగితాలను 'ఉఫ్' న ఊదింది.

కథాప్రారంభం కళ్ళముందు కన్పించింది.

* * *

## రాధ

"ప్రాపరీస్ ఆఫ్ మాటర్"కు పటిక దుమ్ము దులిపి 'కెపర్లాస్' చదవబోతున్నాను—"ఏమమ్మా! రాధా!" అంటూ వదిన గదిలోకి వచ్చింది.

వదిన నన్ను వెతుక్కుంటూ నా గదిలోకి వచ్చిదంటే ఏదో పని ఉందన్నమాటే! ఈ ఆదివారం కదలకుండా కూర్చుని 'ప్రాపరీస్ ఆఫ్ మాటర్' సగమయినా పూర్తిచేసేయాలనుకున్నాను.

ఫిబ్రవరికూడా వచ్చి పదిహేనురోజులయింది. పటుమని నెలరోజులుకూడా లేవు ఇంకా పబ్లికు పరీక్షలు. క్లాసు రాకపోవటం మాట అలా ఉంచి ప్యాసయినా అవగలనా- అని అనుమానం కల్గుతున్నది.

అమ్మ వద్దంటున్నా అన్నయ్య మాట నాసరాగా తీసుకుని బి. యస్సీ లో జేరినందుకు అన్నయ్య గౌరవం దక్కనిస్తే ధన్యురాల్నే. సినిమాలకూ, షికార్లకూ ఇన్నాళ్ళు ఇష్టం వచ్చి తిరిగాను. మహిళా మండలి కార్యదర్శిని పదవి, కళాశాల విద్యార్థినీ నాట్య సమితి అధ్యక్షపదవీ నెత్తినేసుకుని కాలమంతా వృధాచేసుకున్నాను. అమ్మ 'చదువుకోవేమే' అని హెచ్చరిస్తూన్నా వినిపించుకోలేదు. అన్నయ్య 'దానికామాత్రం తెలియదా' అనుకున్నాడో ఏమో మాటమాత్రమయినా అనలేదు ఎన్నడూ. వదిన సంగతి సరేసరి! ఆమె నా విషయమేగాదు—ఇంట్లో ఎవరి సంగతీ పట్టించుకోదు. ఆమె నవలలేమో, ఆమేమో! అన్నయ్యవిషయంలోకూడా ఆమె అంతే!

అలాంటిది ఈ రోజునే చదువు ప్రారంభింపబోయే వేళకు 'రాధా' అంటూ తనకు తాను వచ్చింది.

పుస్తకాన్ని టేబుల్ మీద పెట్టూ "ఏమిటివదినా?" అన్నాను—ఆమె గౌరవం నిలబెట్టూ.

# ★ జీవితం - చదువు ★

"మార్నింగ్ షోకి పోదాం. వస్తావేమో వని"

నేననుకున్నంతా అయింది. వదిన ఊరికి వెళ్ళలేదు. ఆమెకు తెలియకుండానే తెచ్చిన పుస్తకాన్ని మాయించటానికి వచ్చింది.

నేను సందిగ్ధావస్థలో పడ్డాను. ఏడాది నాడు కాపురానికి వచ్చిన వదిన నానుంచి ఎలాంటి సహాయమూ కోరలేదు. కనీసం తల్లో చెండు పెట్టమనికూడా అడగలేదు. అలాంటి ఆమె ఈ రోజు నోరు తెరుచుకుని సినిమాకురమ్మని అడిగేసరికి నేనో అగ్ని పరీక్షకు గురి అయినాను.

పోనీ ఒక్క నాటికేంపోయె—అనుకుందామంటే ఈ రోజు పొద్దునే భగవంతుని ముందు ప్రమాణం తీసుకున్నాను—ఈ నాటినుంచి సినిమాలకూ, 'బీచ్'కూ పోకూడదని

వదినకోసం 'ఈరోజు' రేపటినుంచి అనుకుందామంటె ప్రమాణాలంటె నాకు చెడ నమ్మకం; అవి తప్పటమంటే ప్రాణాల్తో చెలగాటమని నా గాఢవిశ్వాసం.

"ఏమిటమ్మాయ్! ఇంత సేపాలోచిస్తున్నావ్? వారానికి రెండు మూడు సినిమాలు చూసేదానివి"

నా మనసుకు చాలా కష్టమేసింది. వదినతో సినిమాకు రావటం నాకిష్టంలేక మాట్లాడటం లేదనుకుంటున్నది గాని నాలో రేగిన కల్లోలం ఆమెకెలా అర్థమవుతుంది?

"అది కాదు వదినా! నా చదువువిషయం నీకు తెలియదు..."

"నిన్నడగటం లేదని నీచదువును గురించి నాకు తెలియదనుకొన్నావా? భలేదానివే! మీ అన్నయ్య ఎప్పుడూ చెప్తానే ఉంటుంటారు. నువ్వు చాలా తెలివిగలదానివిట. చదవాలే గాని ప్యాసుకాకపోవటమంటూ ఉండదుట"

నేను లాగకుండానే ఆమె దారిలోకి వచ్చినందుకు సంతోషించి అదారి తప్పనీయకుండా నడిపించాను.

"ఆ చదవటమే వదినా ఇంతవరకు లేనిది. పరీక్షలింకా నెలరోజులుకూడా లేవు. ఈ నెలరోజులయినా గట్టిగా చదివితేనే ప్యాసవకలేది."

"నువ్వు నెలల్లా చదవాలా? ఇంటర్ పరీక్షల కెన్నాళ్ళు చదివింది నాకు తెలియదూ? మార్చి ఒకటిన మొదలుపెట్టావు చదవటం."

వదిన నాకు వదినకాకముందు కూడా మా ఇంటికి వస్తూపోతూ ఉండేది నాకన్న ఒక క్లాసు సీనియరు; అన్నయ్యకన్నా ఒక సంవత్సరం జూనియరు. అయినా దూరపు బంధుత్వంవల్ల మాదగ్గరకు వస్తుండేది.

"అవును. పదిహేనురోజులే ఆ పరీక్షలకు చదివింది."

"అయినా ఫస్టుక్లాసు వచ్చిందిగా మీ క్లాసుమేటు విశాలవిషయమేమయింది?"

"చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు జస్ట్ ప్యాసుమార్కులు వచ్చినయ్?"

"అంటె ఆ అమ్మాయి చదవకనా?"

"అలా అని ఎవరంటారు? కాలేజీలో చేరినరోజునుంచీ రెగ్యులర్‌గా చదివింది. కానీ ఏంలాభం? చివరికి పరీక్షలో సరిగా రాయలేకపోయింది ఎవరు ఎప్పుడు ఎంత చదివినా పరీక్షలో వ్రాస్తేనే చదివినదాని ఫలం దక్కేది."

"బాగా చెప్పావు. మరియేం. నువ్వు పదిరోజులు చదివితే చాలు. వ్రాసేయగలవు. ఈ పూట సినిమాకు పోదాం పద..."

"ఇంటర్‌కు పదిహేను రోజులు చదవాల్సి వచ్చినపుడు డిగ్రీపరీక్షకు నెలరోజులయినా చదువవద్దూ?"

"ఇంతెందుకు రాధా! నాతో రావటం ఇష్టంలేకపోతే లేదని చెప్పు. నిన్నింతవరకెప్పుడూ అడగలేదు ఇకముందు అడగను. 'హాంతకుడు' ఇవ్వాళ ఆఖరు రోజట. మీ అన్నగారేమో అయిదు నెలలనుంచి వాయిదాలు వేస్తూవస్తున్న కథాకన్యతో ముచ్చటించుకోవాలిట—తీరదన్నారు. అందుకని నిన్నింతగా బతిమిలాడుకోవాల్సివచ్చింది"

అని అంటున్న వదిన కంఠంలో కాఠిన్యం మొహంలో కోపభావం ప్రస్ఫుటంగా దృగ్గోచరించాయి ఉదయం చేసుకున్న ప్రమాణం, నిశ్చయం—విపులంగా చెప్పకున్నాను. వదిన కోపాకారం వదిలిపెట్టూ నిట్టూర్చింది. నాపరిస్థితి అర్థం చేసుకుందో ఏమో నాకు తెలియలేదుగాని మొత్తంమీద వదినసౌమ్యంగానే సమాధానం చెప్పింది.

"అలాఅయితే నిన్ను రమ్మనటం తప్పులే రాధా! చదువుకో. మీ అమ్మగారు వస్తుందేమో కనుక్కుంటాను."

వదిన వెళ్ళిపోయింది. ప్రథమంలో నేవదినపెట్టిన పరీక్షలో నెగ్గాను కాబట్టి పబ్లిక్ పరీక్షలు ప్యాసవటం కష్టం కాదనిపించింది. కొత్త ఉత్సాహం ధైర్యం చేకూర్చింది. నవీనోత్తేజం విప్పుతట్టింది. ఇంకొంచెం కష్టపడిచదివితే కనీసం సెకండ్ క్లాసయినా రాకపోదు—అన్న ఆశా ఉదయించింది.

పుస్తకం చేతిలోకి తీసుకుని, మనసుదగ్గర పెట్టుకుని చదువనారంభించాను—"ఈచ్ ప్లానెట్ మూవ్స్ ఇన్ యాన్ ఎలిప్స్..."

**భారతమ్మ**

కూరలో తిరగమూత వేసి, 'కృష్ణా, రామా' అనుకుందామని రుద్రాక్షమాలతీశానో లేదో "అత్తయ్యగారూ" అని నోరార పిలుస్తూ కమల వంటగదిలోకి వచ్చింది. నిజం చెప్పొద్దూ—నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఎన్నడయినా చేయిసీలు కానప్పుడుంది మామగారూ—కాస్త కూర తిరగేసి పెట్టమనిగానీ, అలమరలో ఉన్న పెరుగు గిన్నె కొంచెం ఇటియ్యమనిగాని పిలుస్తానా,...పిలిచిన గంటకిగాని పలకదు. అలాంటిది ఈరోజు తనంత తాను వంటింట్లోకి వచ్చిందంటే విచిత్రంగానే ఉంది నామటుకు నాకు.

అక్కడితో అవలేదు. వచ్చిపీటవాల్చుకు కూర్చుంది. ఇది మరీ సౌద్యంగా కన్పించింది నాకు. పనుండి పిలిస్తే ముళ్ళమీద నిల్చున్నట్లు నిల్చుని ఆ పని సగంమాత్రమే చేసి 'అంతఃపురం'లోకి తుర్రుమని పారిపోయే మనిషి—వంటగదిలోని పొగనూ, ఖారునూ లెక్క చేయకుండా పీటవాల్చుకు కూర్చుందంటే నాకేకాదు ఎవరికైనా వింతగా వుండదూ?

ఇంకోరోజు ఇంకోరోజయితే వంట చేసే సమయంలో ఇలా కూర్చుని పిచ్చా-పాటీ మాట్లాడుతూంటే సంతోషించేదాన్నేమో గాని ఈ నాడు-మహాశివరాత్రి పర్వదినాన క్షణం వృథాచేయటం నాకు సుతరామూ ఇష్టంలేదు ఈరోజు నేనెటూ ఉపవాసమే కాబట్టి పొద్దున అననే అన్నాను కమలతో—'రాధ చదువుకోవాలంటున్నది. నువ్వు ఈ పూట వంటచెయ్యవే నేను కాస్త జపమైనా చేసుకుంటానూ—' అని కాని వింటేగా! అలాంటిది మరిప్పుడెందుకు వచ్చింది? చల్లకువచ్చి ముంత దాచుకుంటుం దెందుకు?

"ఏమిటే?" అని ప్రశ్నించాను సూటిగా.

"ఏం లేదండి. మీ అబ్బాయిగారు మిమ్మల్నడగమన్నారు."

"ఏమడగమన్నారు?"

"అన్నం తిన్నతర్వాత పన్నెండున్నరకు సినిమాకు పోదామని..."

"దానికి నన్నడిగేదేముంది? ప్రతిసారీ పోయేటప్పుడు నన్నడిగే పోతున్నారా?"

"వారికి తీరిక లేదుట. రాధ చదువుకుంటున్నది. మీరువస్తే పోదామని..."

"నాకు చెప్పకోసం వచ్చింది శివరాత్రి నాడు సినిమా ఏమొచ్చె నాకు! నువ్వు లేకపోతే సరి. పైగా అడుగుతున్నది చూడండి ఇందుకా ఇంత నక్క వినయాలు.

అరవయ్యో పడిలో కూడా పడ్డాను. ఇంకా సినిమాలుకూడా చూడాలి—తగుతునమ్మ అని. యాభై సంవత్సరాలు ఇప్పటికే వృథా అయిపోయినయ్—అని వ్యథ చెందుతున్నాను. సంసారపు మమకారంలో పడి ఇప్పటిదాకా భగవంతుణ్ణి తలంచనే లేదు. ఇహ బంధాల్లో కట్టుబడిపోయాను. మొన్న చేయి మాపిం చుకున్నప్పటి నుంచీ మరీ దిగు

లుగా ఉంది. ఇంకా పదేళ్ళు బ్రతుకుతానుట. ఓపికచచ్చిపోయింది. చూపుపోయింది. ఒంట్లో బలం హరించుకు పోతున్నది రోజు రోజుకూ. పదేళ్ళు బ్రతికినా గొప్పే! ఈ లోగానే పోతానేమోనని భయంగా వుంది. మానవజన్మ లభించటం మహోన్నత మంటారు. ఆ భగవద్దత్తవరాన్ని నేనెంతవరకు ఉపయోగించుకున్నానూ అని ఆలోచిస్తే అణుమాత్రమయినా వినియోగించుకోలేదని తెలుస్తున్నది. ఇప్పటికయినా మేల్కొంటే కొంతవరకయినా చిత్రగుప్తుడిముందు చెప్పుకోవచ్చు. ఈ సినిమాలకు, నాటకాలకు పోతే ఏమొస్తుంది!

"ఏమంటారు అత్తయ్యగారూ?"

నేనేమీ మాట్లాడకపోయేసరికి కమల తిరిగి ప్రశ్నించింది.

"సాయంత్రం శివాలయానికి పోదామనుకుంటున్నాను. ఇవ్వాళ శివరాత్రికదూ!.."

అంతకుముందు ఎంతో ఘోర పాపం చేసినా, యీ ఒక్కనాడు ఏ కొద్ది పుణ్యం చేసినా, తిండి దొరక్క ఉపవాసంచేసినా, జారచోరులై జాగరణచేసినా—ఒక్కసారి మనసారా "శివాయనమః" అని గొంతెత్తి అరిచినా... అవ్యాజానురాగంతో, అపార కరుణాసముద్రుడై అపాంగదృష్టి బరపి తన సాన్నిధ్యం ప్రసాదించే మహాదేవుడు కళ్లకు గట్టటంతో ఒళ్ళు జలదరించింది.

కమల మొహం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది. ఉన్నమాట అన్నాను అది తర్వాత ఏమయినాఅనుకోనీ. దానికి నేనేం చేస్తాను? నా బాధ్యతేముంది గనుక?

నే చెప్పింది అర్థం చేసుకుంటుందా జీవితంమీద సరైన దృక్పథం ఏర్పరుచుకుని బాగుపడుతుంది. అపార్థం చేసుకుని "అత్తగారయినందుకు అధికారం చూపించింది" అని అనుకుని ఎందుకూ పనికిరాని ఆ చెత్త నవలలు చదువుతూ, శుక్కదండగమారి సినిమాలూ చూస్తూ కూర్చుందా నాలాగా నే వృద్ధాప్యంలోగాని జీవితసత్యం అవగాహన చేసుకోలేదు.

"శరౌ స్మరణాన్ముక్తిః" అన్నారు కాబట్టి నామస్మరణ చేయ ప్రారంభించాను కమల విషయం కమలకు వదిలేసి—

"హరేరామ హరేరామ రామరామ హరే హరే..."

## కమల

ఏ క్షణాన నేను సినిమాకు పోదామని అనుకున్నానో గాని, ఆ ముహూర్తం అతి బలవత్తరమైనది. నా జీవిత గమనాన్నే మలుపు తిప్పే మహత్తరానుభూతి ప్రసాదించిన శుభఘడియ అది.

సంసార రథాన్ని నడపటానికే హరించుకుపోతున్న తన కాలంలో వీలు చూసుకుని వారానికోసారి వచ్చే ఆదివారం శాశ్వత కీర్తిని తెచ్చిపెట్టే సత్కర్మకై సద్వినియోగం చేసుకొంటున్నారు శ్రీవారు.

ఎనిమిది నెలలనుంచీ పుస్తకం ఎలా ఉంటుందో చూడని రాధ—క్లాసుపరీక్షలకూ, కాలేజీ పరీక్షలకూ ఎగగొట్టైనా—నెలరోజులుందనగా కళ్ళుతెరిచి పబ్లిక్ పరీక్షలకోసం రాత్రింబవళ్ళూ చదవబోతున్నది.

సంసారపు ఊబిలో దిగబడిపోయి దైవ చింతనలేని అత్తగారు మరణం దగ్గరపడుతున్నదని తెల్సుకుని ఈలోగానే తనశక్తి కొలది భగవధ్యానం చేస్తున్నది.

రాధనూ, అత్తగారినీ చూస్తే—నాకు జీవితంమీద ఒకవిధమైన అభిప్రాయం కలుగుతున్నది; జీవితానికీ, చదువు సామ్యం కన్పిస్తున్నది.

క్లాసు పరీక్షలనూ, కాలేజీలనూ లెక్కచేయని రాధకు యూనివర్సిటీ పరీక్ష అంటే ఎక్కడలేని భయమూ వచ్చిపడింది; ఎన్నడూలేని శ్రద్ధ చదువుమీద ఏర్పడింది. అత్తగారి విషయంలోనూ అంతే; ఆమే తెల్సుకున్నది తన పబ్లిక్ పరీక్షా ఇంకా ఎన్నో రోజులులేదని. ఆమెకు పరీక్ష మరణమే! జీతం కట్టిన వారందరికీ హాల్ టిక్కట్టు వచ్చినట్లుగా, జన్మించిన ప్రతిప్రాణికీ మరణం తథ్యం. కాని ఎటొచ్చీ రాధ హాల్ టిక్కట్టు వచ్చినా ఇంకో సంవత్సరానికి పరీక్షవాయిదా వేసుకోవచ్చు; అత్తగారికి మాత్రం అలాంటి అవకాశంలేదు. అంతేగాక రాధ చదువుకు విలువకట్టేవాడు యీ లోకం మనిషి అయితే, అత్తగారి జీవితంలోని మంచి-చెడులను విమర్శించేవాడు మరోలోకపు వాడు.

ఇంకా లోతుగా ఆలోచిస్తే వాటివాటి లక్ష్యాలలో కూడ సామ్యం కన్పిస్తున్నది.

చదువుకు—ఒకరోజు కానీ, రెండు రోజులుకానీ, ఏటికేడాదికానీ—లక్ష్యం పరీక్షనాడు అడిగినప్రశ్నలకు సరైన సమాధానాలు వ్రాయటం. జీవితంలోనూ అంతే! ఒకసారి అనుకోనీ, వందసార్లు అనుకోనీ—నామస్మరణలక్ష్యం తుదిఘడియల్లో భగవన్నామం ఉచ్చరించగల్గటం.

మరి అందరూ చరమాంకంలో వే శ్రమించకూడదూ?—చాలామందికి ఆమనో దారుఢ్యమూ లేదు; ఆత్మవిశ్వాసమూ అత్యల్పం. ఆ దారుఢ్యమూ, విశ్వాసమూ ఉంటే విద్యార్థులు సంవత్సరం పొడుగునా ఆట పాటల్లో, నాటకాల్లో, నాట్యాల్లో, అన్ని ఎక్స్ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్ లోనూ ఆనందం పంచుకుంటారు; అటు పరీక్షల్లోనూ విజయం అందుకుంటారు. అలాగే జీవితంలోనూ అన్ని ఇహసుఖాలూ అనుభవిస్తారు, ఆలోకంలోనూ అగ్రగాములౌతారు.

శ్రీవారూ, రాధా, అత్తగారూ-ముగ్గురు ఏదో విలువను సాధించే దృఢ సంకల్పులై ఆ ప్రయత్నంలో ఉన్నారు. కాని—నేనో డిటెక్టివ్ నవలలూ, రైల్వే సాహిత్యమూ, చదువుకుంటూ కాలం వృథా చేసుకుంటున్నాను; చౌకబారు సినిమాలూ చూస్తూ డబ్బు అనవసరంగా ఖర్చు పెట్టున్నాను.

'చదువు' అధ్యాయం నా జీవితకావ్యంలో ముగిసి దాదాపు ఏడాది అయింది. అత్తగారి ప్రకరణంలో ప్రవేశించటానికి ఇంకా పాతిక సంవత్సరాల కాలం ఉంది. బాగా ఆలోచిస్తే బాధ్యతలు గుర్తెరిగి భావిజీవితం సుఖంగా సాఫీగా గడిచిపోయేలా మలుచుకోవాల్సిన సువర్ణ సమయమిది.

గృహాన్ని స్వర్గసీమగా మార్చటమే గృహిణినయిన నాకర్తవ్యం. ఆ కర్తవ్య సాధనకు మార్గం ఉండనే ఉంది. అత్తగారి చేతిలోని వంటపని తీసుకుని ఆమెకొంత విశ్రాంతిలభింపచేయాలి; పైపనులు చూస్తున్న రాధకు ఇక ఆ బెడదలేకుండా చేసి ఇరవై నాలుగు గంటలు ఆ అమ్మాయి స్వవిషయాలకే వినియోగించుకునేలా చూడాలి; ఆదాయాన్ని మించుతున్న వ్యయాన్ని ఎదుర్కొనటానికిగాను శ్రీవారు చేస్తూన్న అదనపుపని మాన్పించి ఆకాలాన్ని తన ఆదర్శమూ, విలువలూ సాధించేందుకు వదిలిపెట్టి నేనింట్లో పొదుపుచేసి ఒకకానీ అయినా ఆదాయమే ఎక్కువయేలా ప్రయత్నించాలి—ఇది నాపథకం.

స్వధర్మ నిర్వహణ ప్రారంభించాను; కథ వ్రాసుకుంటూన్న శ్రీవారికి కాఫీఏమయినా కావాలేమో కనుక్కుందామని వారి గదిలోకి అడుగు పెట్టాను.

## రావు

చాలా రోజులతర్వాత వ్రాస్తున్నందుకు కథ నవీనపంథాన, అందంగా, సాఫీగా నడచింది కాని—పాత్రలు ఆత్మ విమర్శ చేసుకుని ఆదర్శ ప్రాయంగా రూపొందటంతో కథ మరీ ప్రబోధాత్మకంగా తయారయి సాంఘిక ప్రయోజనం బొమ్మ కటిస్తున్నది. నేనెలాంటి రచన ప్రచురించినా తప్పకుండా చదివే సంధ్య సుతరామూ ఇలాంటి పద్ధతికి ఒప్పుకోదు. ఈరకం కథలు ఇరవయ్యో శతాబ్దపు ఉత్తరభాగంలో ఘోషను కాదంటుంది.

"పాత్రల బలహీనత చిత్రిస్తేచాలు—లోపాలు దిద్దుకోబడుతయ్. ధైర్యం నరనరాన జీర్ణించుకు పోతుంది; సంఘం సంస్కరించ బడుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే సాంఘిక ప్రయోజనం సాధించ బడుతుంది"—అని సంధ్య తన ఉద్దేశం నాకు ఎప్పుడూ చెప్తూ ఉంటుంది. ఈసారి సంధ్య అభిప్రాయం బలపరుస్తాను.

(46-వ పేజీ చూడండి)

## పరీక్షాపత్రాల దొంగలు

తాళం చేతుల గుత్తిలోంచితీసి వీళ్లకి యివ్వడం, గది ప్రక్క తలుపు గడియవేయకుండా మూసి వుంచడం వీరి దొంగతనానికి దోహద మిచ్చాయి."

సబ్ యిన్స్పెక్టర్ "సూరన్నే దొంగతనానికి మార్గాన్ని చూపి, ప్రోత్సహించాడే!" నని చెపుతూ, అతన్ని లాకప్‌లోకి ఒక తోపు తోసి, మోహనరంగానికి గట్టిగా షేక్‌హాండ్ యిస్తూ, "అద్భుతమైన డిటెక్షన్"అని మెచ్చుకొన్నాడు. ★




## జీవితం-చదువు

(11 వ పేజీ తరువాయి)

పఠితలనుంచి ఏవిధమైన రెస్పాన్స్ వస్తుందో చూడవచ్చు.

"ఏమండోయ్ ఎందాకా వచ్చిందికథ?"

రామాయణంలో పిడకలవేట అంటే ఇదే! మంచి రసవత్తరఘట్టంలో చచ్చుప్రశ్నలో ప్రవేశించింది శ్రీమతి.

"ఒక్క అయిదునిముషాలు ఆగు. ఆఖరు ఘట్టంలోకి వచ్చాను."

"అప్పుడే ఆఖరుఘట్టంలోకి వచ్చారా?_ ఇవ్వాళల్లా పట్టుందన్నారు మరి?"_ఆశ్చర్యపోయింది.

"కొంచెంఆగు దేవీ! నన్ను మాట్లాడించకు" విసుక్కున్నాను.

మొహం కందగడ్డ చేసుకుంది. సూర్యాస్తమయానంతరం ఆకాశం సంధ్యారాగం పులుముకున్నట్లు. మొక్కలోనే తుంచాలిగాని మానయిన తర్వాత నరుకుదామంటే నరాలు తెగుతయ్. రూపాయి వడ్డీమీద అనురాగం అప్పు తెచ్చుకుని విసవిసా ఇంట్లోకి పోయిన శ్రీమతిని కేకేశాను.

వచ్చింది. దగ్గరకురాలేదు. అల్లంత దూరాన గది గడపదగ్గర నిల్చున్నది 'ఏమిటా' అన్నట్లు. దేవీ ప్రసన్నంకోసం అభిమానం తాకట్టుపెట్టి ఆప్యాయత తెచ్చుకున్నాను గొంతులోకి.

"అంతకోపమయితే ఎట్లా చెప్పు?"

శ్రీమతి మొహాన తారాడుతున్న సాంధ్య మేఘాలు విడిపోయి, చంద్రోదయమయింది. నల్లని కళ్ళలో పున్నమివెన్నెల ప్రతిబింబించింది. తెల్లని పలువరుస తళుక్కుమంది. నడిచివచ్చింది నవ్వులగవ్వలు కుమ్మరించుకుంటూ టేబుల్‌మీద కాగితాలు పేజీల వారీగా సర్దుతూ__

"అయిదునిమిషాల్లోఅయిపోతుందన్నారు కాబట్టి — ఇప్పుడెంతయింది, పదకొండేగా—పన్నెండున్నరకు 'సరస్వతీ'కి పోదాం. మంచి క్రైమ్‌పిక్చర్ —'హంతకుడు' ఏమంటారు? మాట్లాడరేం?"

పక్కింటివారిఅమ్మాయి పార్వతి ఎప్పుడు కొట్టిందో దాలిగుంటలోంచి పారిపోయిన కుక్క తిరిగి అక్కడికే చేరుతున్నది.

నాకు నవ్వువచ్చింది. ఇంకా దిగులుపడుతున్నాను. శ్రీమతి నా కాలాన్ని వృథా చేస్తున్నదేమోనని. అంత్యఘట్టంగురించి ఇక ఆలోచించాల్సిన అవసరంలేదు. రెండు నిమిషాల్లో వ్రాసేయగలను. శ్రీమతి నుంచి 'మేటర్' బాగా అందింది. కొందరు కోరకుండానే, తమకు తెలియకుండానే సహాయం చేస్తారు.

"త్వరగా ఆ మిగిలింది కాస్తా వ్రాసేసుకోండి! శుభస్యశీఘ్రం అన్నారు పెద్దలు"

"అవశ్యం..." ★

## అమెరికన్ నటీనటులు

(6 వ పేజీ తరువాయి)

విశ్వవిద్యాలయ బృందంవారు నాటక ప్రదర్శనవల్లనైతే నేం, వారి ప్రవర్తనవల్లనైతేనేమి హైదరాబాదు పౌరుల హృదయాలలో ఒక స్థానం సంపాదించుకొన్నారు. తమ స్నేహభావానికి చిహ్నంగా భారతీయ నాట్యసంఘం (ఆంధ్రప్రదేశ్ శాఖ) నటరాజు చిత్తరువునొకటి వారికి బహూకరించింది.

అమెరికానుంచి చౌకగాదిగుమతి అయ్యే చౌకబారు భూతద్దాలకు బదులు, ఇటువంటి కళాకారుల బృందాలను తరుచు భారతదేశానికి పర్యటనార్థం రప్పించగలిగితే, అమెరికా భారతదేశాలమధ్య కరుడుగట్టిన విభేదాలు కరిగిపోతాయి కనీసం సాంస్కృతిక రంగంలో.

తుదిని ఒక్కమాట: ఈ కార్యక్రమ పరంపరతో ఆంధ్రప్రదేశ్‌లో థియేటర్ సెంటర్ చక్కగా పనిచేస్తుందన్న సంగతి వెల్లడియైంది. నిర్వాహకులు, సహృదయులు, అనేకవిధాల సమర్థవంతులు. కాని ప్రచార సాధనాల విలువను వీరు పూర్తిగా గ్రహించినట్టులేదు. సికిందరాబాదు త్యాగరాజ గాన సభవారు త్యాగరాజువలె నేనిష్కాములు. వారికి ప్రచారం అవసరంలేదు. ప్రచారం ప్రమాదకరమని భావించే సంస్థలు కూడా నగరంలో లేకపోలేదు. అటువంటి సంస్థలపైనే పత్రికలు ఎక్కువ దృష్టిబరపడం తమ బాధ్యతగా స్వీకరిస్తాయి. భారతీయ నాట్యసంఘం అటువంటి సంస్థకాదు. అది చేస్తూన్న ప్రయోజనాత్మకమైన కృషి ప్రజలకు తెలియాలంటే నిర్వాహకులు ప్రచారసాధనాల ఆవశ్యకతను గుర్తించడం అవసరం. ★